లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్ష


చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో..

కుషాయిగూడ: చర్లపల్లిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సమగ్ర ఆరోగ్య పరీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోషకాహార లోపాన్ని నివారించేందుకు మందులు, ఆహార పోషకాలు పంపిణీ చేశారు. అనంతరం లయన్ ఎస్.మనోహర్‌రెడ్డి పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కె.మాధవి, లయన్ ఎస్.విశ్వేశ్వర్‌రావు, పీవీ.రమణరావు, గోపాల్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ టోర్నమెంట్...

ఉప్పల్: ఉప్పల్ జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అండర్- 14, అండ్-17 జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాల వేదిక కావడం అభినందనీయమన్నారు. అందుకు కృషి చేసిన పద్మావతిని ఆయన అభినందించారు. ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. చదువుతో పాటు క్రీడల్లో మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీఆర్‌ఎస్ నేతలు మేకల మధుసూదన్‌రెడ్డి, శ్రీను, రమేష్ గుప్తా, బాలకృష్ణ, సుక్కకిరణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కామాక్షిపురంలో నెలకొన్న వివిధ సమస్యలపై కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ నాగమణి, జలమండలి మేనేజర్ రవీందర్‌గౌడ్‌తో కలిసి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో రాజకీయాలకు తావులేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. స్థానిక సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.


కామాక్షిపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్

కార్పొరేటర్ పర్యటన


ఆనందరావునగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ ఆనంద్‌రావునగర్‌లో మంగళవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో మురుగు కాలువలు, ఓపెన్ డ్రైయిన్ మూసుకుపోవడం వంటి సమస్యలను గుర్తించారు. వెంటనే కాలనీలో యూజీడీ రీమోడలింగ్‌కు ప్రతిపాదనలు రూపొందించి నాలా డీసిల్టింగ్ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, ఇమ్రాన్, ఏఈ అభిషేక్, రామారావు, మల్లేష్‌గౌడ్, సాజిద్, అరుణ్, గిరి తదితరులున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

మల్కాజిగిరి: ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ నర్సింగరావు అన్నారు. నేరెడ్‌మెట్ అంబేడ్కర్ భవన్‌లో సీపీఎం మల్కాజిగిరి మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్ట్ పార్టీలు కనుమరుగైపోయాయని అనుకుంటున్న రోజుల్లో అనేక దేశాలు కమ్యూనిజాన్ని కోరుకుంటున్నాయన్నారు. యుద్ధాల వల్ల నష్టమే తప్పా.. లాభం లేదని, యుద్ధాన్ని వ్యతిరేకించి ప్రపంచ శాంతిని కోరుకోవాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగం పెరిగిపోయిందని, దళితులు, గిరిజనులు, మైనార్టీలకు రక్షణ లేకుండాపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన ప్రభుత్వం వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మృతిచెందిన సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి 8 తీర్మానాలను ప్రవేశపెట్టారు. మండల నూతన కార్యదర్శిగా గుంటి లక్ష్మణ్‌ను ప్రకటించారు. జిల్లా నాయకులు సత్యం, కోమటి రవి, నాయకులు కృపాసాగర్, నారాయణరెడ్డి, నర్సింగరావు, మంగ, కొండల్, విజయ్, శ్రీనివాస్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మండల మహాసభలో పాల్గొన్న నాయకులు

అభివృద్ధి పనులు ప్రారంభం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ కుషాయిగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ.. అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని, ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా అన్ని డివిజన్లకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. డీజీఎం సతీష్, ఏఈ సందీప్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కుషాయిగూడ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, పండాల శివకుమార్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, పనగట్ల చక్రపాణి, దేవేందర్‌గౌడ్, కిషోర్, బాబు, అనిల్‌బాబు, యాదయ్య, వెంకటేష్, క్రాంతి, బాలనర్సింహ, నర్సింగ్‌రావు, గణేష్‌గౌడ్, దయానంద్, దినేష్, అంజన్న, మణికిరణ్, శ్రీనివాస్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

డా. ఏఎస్‌రావు జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి

కుషాయిగూడ: డాక్టర్ ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక విజ్ఞానదర్శిని ఆధ్వర్యంలో హెచ్‌బీకాలనీ ఫేస్-2 గ్రౌండ్‌లో సెయింట్ పాల్స్ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ ఏఎస్‌రావు జీవిత చరిత్ర చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ.. డాక్టర్ ఏఎస్‌రావు నిరుపేద కుటుంబంలో జన్మించి ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని, మన ప్రాంతంలో ఈసీఐఎల్ కంపెనీని స్థాపించి దేశానికి గొప్ప పేరు తీసుకొచ్చారన్నారు. ఆయన చేసిన సేవలు, జీవితచరిత్రను ఆదర్శంగా తీసుకుని ఎంతో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నసీమా, పాఠశాల నిర్వాహకులు సత్యారెడ్డి, విజ్ఞానదర్శిని ఏఎస్‌రావు విజ్ఞానవేదిక నిర్వాహకులు రమేష్, అధ్యక్షులు యాదగిరి, కాలనీ అధ్యక్షులు వెంకటాచారి, స్థానిక నేతలు జగదీష్, వెంకటేష్, చంద్రమోహన్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

ప్రతీ పౌరుడు రక్తదానం చేయాలి: ఏసీపీ మహేష్

జవహర్‌నగర్: పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో మంగళవారం యాప్రాల్‌లోని డీఎస్‌ఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుషాయిగూడ ఏసీపీ మహేష్ హాజరై మాట్లాడుతూ.. పోలీసుల త్యాగాలు ప్రజలు గుర్తించాలన్నారు. ప్రతీ పౌరుడు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో పోలీసులు, స్థానిక యువత 40 మంది రక్తదానం చేయగా వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్‌ఐ ఇద్రీస్ అలీ, ఎస్సైలు రామునాయక్, లక్ష్మయ్య, పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాణాసంచాతో తస్మాత్ జాగ్రత్త!



- చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై..
- సూచనలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రామంతాపూర్: దీపావళి పర్వదినం సందర్భంగా ఉప్పల్ సర్కిల్‌లోని రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్ ప్రధాన రహదారులపై బస్తీలు కాలనీలోని అంతర్గత రహదారులపై వివిధ ఫంక్షన్‌హాల్‌లో బాణాసంచా విక్రయ కేంద్రాలకు కూడా లైసెన్స్ ఫీజు రూ.11,000 నిర్ణయించారు. కాగా చాలా మంది లైసెన్లు తీసుకోకుండానే వివిధ రకాలైన బాణా సంచాలను విక్రయిస్తున్నారు.

◆ ముఖ్యంగా పిల్లలు వివిధ రకాలైన బాణాసంచాలు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానిక అగ్ని మాపక కేంద్రం అధికారులు చేసిన పలు సూచనలు ఇవి..


రామంతాపూర్‌లోని బాణాసంచా విక్రయ కేంద్రాలు

◆ పిల్లలచే బాణా సంచాలు కాల్చేటప్పుడు ఇరుకు ప్రదేశాల్లో కాకుండా విశాలమైన ప్రాంతాల్లో కాల్చేలా పెద్దలు తగిన చర్యలు తీసుకోవాలి.

◆ పిల్లలు టపాకాయలు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు, పెద్దలు వారి వెంట ఉండి పర్యవేక్షిస్తుండాలి.

◆ పిల్లలకు పెద్ద శబ్దాలు వచ్చే బాణాసంచా బాంబులతో పాటు పైకి ఎగిరి పేలే రాకెట్ల వంటి వాటిని కాల్చకుండా జాగ్రత్త పడి కేవలం చిచ్చుబుడ్డి, చిన్నచిన్నవి కాల్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

అగ్ని ప్రమాదాలపై..

బాణాసంచా దుకాణంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే ఈ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. అగ్ని మాపక విభాగం ఫోన్ నెంబరు 101.

◆ బాణాసంచాలు కాల్చేటప్పుడు పెద్దలు, పిల్లలు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి. పిల్లలకు ఏ విధంగా కాళ్లాలో నేరిపించాలి.

◆ చిన్నారులు టపాకాయలు కాల్చేటప్పుడు పొరపాటున వారి శరీరంపై పడి గాయాలైనప్పుడు వెంటనే చల్లటి నీటితో గాయాలపై పోసి వైద్యులను సంప్రదించాలి. ప్రమాదాల్లో పిల్లల చేతులు, కాళ్లపై బొబ్బలు ఏర్పడితే వాటిని ముట్టుకోకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

స్టాల్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

బాణాసంచా విక్రయించే దుకాణాలు పక్కపక్కనే కాకుండా మధ్యలో కొంచెం స్థలం వదిలి ఉండేలా చూసుకోవాలి.

◆ ప్రతి టపాకాయలు అమ్మే షాపుల్లో అగ్ని ప్రమాద నివారణకు ఉపయోగించే పరికరాలు ఉంచుకోవాలి.

◆ బాణసంచా స్టాళ్లపై కప్పు ప్లాస్టిక్ కవర్లు కాని సింథటిక్ కవర్లు ఉపయోగించకూడదు. సిమెంట్ రేకులు, స్టీల్ రేకులు ఉపయోగించుకోవచ్చు.

పర్యావరణ హితానికి కృషి..

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితం కోసం సమిష్టిగా కృషి చేద్దామని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కాలుష్య నివారణపై నిర్వహించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా వల్ల పర్యావరణ కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించి సమిష్టిగా నిర్ణయం తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కేవలం దీపకాంతులతో పండుగను నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

వాసవీనగర్‌లో తాగునీటికి కటకట

బోడుప్పల్: 23వ డివిజన్ పరిధిలోని వాసవీనగర్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గతేడాది కాలంగా కాలనీలో పైపులైన్లు పగిలిపోవడంతో సరఫరాకు అంతరాయం కలుగుతోంది. తాగునీటి సరఫరా సమయంలో నీటిసరఫరా పైపులైన్‌కు నేరుగా మోటర్లు పెట్టి ట్యాంకులు, సంపులు నింపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మిగిలిన వారికి కనీసం తాగేందుకు నీరు రావడం లేదు. తాగునీరు రాని ఇంటి యజమానులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. దీనిపై జలమండలి అధికారులు, మేయర్, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. ఈ సమస్యను పట్టించుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామంటున్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

అల్వాల్: భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యనగర్‌కు చెందిన రమేష్, భార్య లావణ్య (40), వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్‌కు అప్పులు పెరగడంతో పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని భార్య లావణ్యను మానసికంగా వేధించేవాడు. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో బిల్డింగ్‌పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

అల్వాల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ట్రాన్స్‌జెండర్‌ని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానాజీగూడలో నివసించే హరీష్ (30) స్థానికంగా నివసించే ట్రాన్స్‌జెండర్ లాస్య (25)తో గత ఐదేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కూడా వాడుకున్నాడు. లాస్య తాను సంపాదించిన రూ.10 లక్షల నగదు, రెండు తులాల బంగారం హరీష్‌కి ఇచ్చింది. ఆమె ఇటీవల హరీష్‌పై పెళ్లి గురించి ఒత్తిడి తేవడంతో ముఖం చాటేసి పారిపోయాడు. దీంతో తాను మోసపోయానని భావించి అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మాసశివరాత్రి పూజలు

గౌతంనగర్: మాసశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో రుద్రయాగం, స్ఫటిక లింగానికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ ప్రకటించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న 'కేఆర్‌సీ' ఎగ్జిబిషన్


బోట్ రైడ్‌లో చిన్నారులు


ఎగ్జిబిషన్‌లో సందర్శకులు

బోడుప్పల్: ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌సీ ఎగ్జిబిషన్ సందర్శకులతో ఆకట్టుకుంటోంది. బిజీగా ఉండే నగర శివారు ప్రజలకు ఈ ఎగ్జిబిషన్ ఆట విడుపుగా మారింది. సింహ ద్వారం అత్యంత ఖరీదైన ఆర్‌ఆర్‌ఆర్ సెట్టింగ్ నమూనాతో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్ ఎంతో సందడి చేస్తోంది. దీపావళి పండుగను పురస్కరించుకుని జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలంబో, డ్రాగన్, ట్రెన్, బోట్‌రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్, జువెలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, డ్రైఫ్రూట్స్, ఫుడ్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నారాయణ ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. శివారు ప్రజలు నిత్యం బిజీగా ఉండే వారికి వినోదం, ఆనందం, ఆహ్లాదాన్ని పంచేలా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నమూనాలను ఏర్పాటు చేయడంతో ఇక్కడి ప్రజలు ఎంతో ఆనందంగా గడుపుతున్నారన్నారు.

మోడరేటర్‌గా బిషప్ విల్సన్ ఏకగ్రీవం

ఉప్పల్: తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానంలో బిషప్ విల్సన్ సింగంను మోడరేట్‌గా ఎన్నుకున్నట్లు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సింగం తెలిపారు. మోడరేట్‌గా దేవుని ప్రజల నిమిత్తం అందరితో సమాధానం కలిగి ఉండే విధంగా అన్ని రంగాల్లో పదవి గౌరవాన్ని కాపాడుతానన్నారు. నగరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా 120 మంది బిషప్‌లు పాల్గొన్నట్లు వివరించారు. తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ ,బీసీల అభ్యున్నతి కోసమే ఇంటింటి కుటుంబ సర్వే

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రధాన ఉద్దేశం వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాలు , తెగలు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసమేనని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శేఖర్‌తో కలిసి సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఓ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సర్వే ఎలా నిర్వహించాలని, డేటాను ఎలా సేకరించాలి, సర్వేలో ఎదురయ్యే సాధారణ సమస్యలను ఎలా పరిష్కరించాలనే విషయాలపై వివరంగా అదనపు కలెక్టరు గుప్తా సూచనలు చేశారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన ఈబీలో ప్రతి కుటుంబాన్ని క్రమపద్ధతిలో జాబితా తయారు చేసి ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలన్నారు. హౌజింగ్ సర్వే పూర్తయిన వెంటనే ప్రతి ఇంటి ముఖ్య ద్వారానికి ప్రక్కన స్టిక్కర్‌ని అతికించాలన్నారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబ యజమాని నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్యూమరేషన్‌లో నింపిన షెడ్యూల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఎన్యుమరేటర్ నిర్దేశించిన డేటా ఎంట్రీ కేంద్రానికి వచ్చి ఆపరేటర్‌తో డేటా ఎంట్రీని పూర్తి చేయించాలన్నారు. సూపర్ వైజర్లు ఫీల్డ్‌లో ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించి అవసరమైన సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు సేకరించిన డేటాలో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంచుకుని ఆ ఇండ్లను సందర్శించి డేటాను మరలా తనిఖీ చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో కిందిస్థాయి ఎన్యూమరేటర్లకు మార్గదర్శకంగా వ్యవహరిస్తూ సహాయం అందించాలన్నారు. సర్వే సమర్థవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం సర్వేకు సంబంధించిన నిర్ణీత ఫారాలను ఏవిధంగా పూరించాలనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.



జిల్లాలో 29.40 లక్షల ఓటర్లు

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల సంఘం మంగళవారం ఓటరు జాబితాను విడుదల చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓటర్లు 29,40,923 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 15,13,910 మంది, మహిళా ఓటర్లు 14,26,612 మంది, ట్రాన్ జెండర్ ఓటర్లు 401 మంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 725 మంది, సర్వీస్ ఓటర్లు 735 మంది ఉన్నారు.

షేర్‌మార్కెట్‌లో నష్టపోయానని వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి: షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన ఓ యువకుడు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్ గోల్డెన్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న వెంకటేశ్వరకుమార్ పెద్ద కుమారుడు వంశీకుమార్ (31) ప్రైవేట్ ఉద్యోగి. కాగా వారు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నారు. రోజూ వంశీ అందులో జిమ్ చేసేవాడు. ఈనెల 27న యథావిధిగా జిమ్ చేయడానికి వెళ్లాడు. నైజీరియాలో ఉండే వెంకటేశ్వరకుమార్ సోదరుడు అతడికి ఫోన్‌చేసి వంశీకుమార్ మూడ్రోజుల క్రితం ఫోన్ చేశాడని, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు నష్టపోయానని, సహాయం చేయాల్సిందిగా కోరాడని చెప్పాడు. వెంటనే ఆయన వంశీకుమార్‌కు ఫోన్ చేయగా తీయలేదు. దీంతో రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన ర్యాలీ



ఈసీఐఎల్ చౌరస్తా వద్ద ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కుషాయిగూడ: వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా లైఫ్‌లైన్ తులసీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఈసీఐఎల్ చౌరస్తాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్ట్రోక్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కొత్త రామారావు, ఐలేని జయరాంరెడ్డి, డాక్టర్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ సాయివివేక్, శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మదన్‌కుమార్, ఇందుమతి, సాయిసుధీర్ కళాశాల విద్యార్థులు, తులసి ఆసుపత్రి నర్సింగ్ స్టాఫ్, ఈసీఐఎల్ రన్నర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం



కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమైక్యత దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తూ 8,9 తరగతుల విద్యార్థులు రాంపల్లిలో ఐక్యతా పరుగులో పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజరావు మాట్లాడుతూ.. నాడు భారతదేశ ఉప ప్రధానిగా పటేల్ తీసుకున్న నిర్ణయాలు జాతి ఐక్యతకు ఎంతగానో తోడ్పడ్డాయని, నేడు కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలు లేకుండా మనమంతా భారతీయులుగా జీవిస్తున్నామంటే నాడు పటేల్ తీసుకున్నటువంటి సాహసోపేతమైన నిర్ణయాలే కారణమని, ఆ మహనీయుని త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు.

నవంబర్ 6 నుంచి కులగణన సర్వే చేపట్టండి

సాక్షి,సిటీబ్యూరో: నవంబర్ 6 నుంచి సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో అన్నింటినీ చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంగళవారం సచివాలయం కేంద్రంగా అన్ని జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా నుంచి పాల్గొనగా.. వీసీలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు కులగణనపై భట్టి దిశా నిర్దేశం..

కలెక్టర్లు సమగ్ర కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కలెక్టర్లు ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించడం, ప్రతి ఎన్యుమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, సర్వే షెడ్యూల్, ఎన్యూమరేటర్స్ మాన్యువల్ అందే విధంగా చూసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్యుమరేటర్లకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని, వారికి కేటాయించిన సర్వే షెడ్యూల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండేలా జిల్లా కలెక్టర్లు వారికి శిక్షణ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎన్యూమరేటర్లు ముందుగా ఇంటి జాబితాను పూర్తి చేసి, పాఠశాల వేళల తర్వాత ప్రతిరోజూ 5-7 ఇళ్లను సందర్శించడం ద్వారా ఇంటి షెడ్యూల్‌ను ప్రారంభించాలని, సర్వేలో నిర్వహణను పటిష్టంగా చేపట్టి నాణ్యమైన అవుట్‌పుట్ పొందడానికి అవసరమైన సమయాన్ని కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సర్వేను నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణపై ప్రతి రోజు పర్యవేక్షక సిబ్బందితో సమీక్ష నిర్వహించాలన్నారు. సర్వే గురించి టామ్ టామ్ బీట్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రకటించాలన్నారు. సామాజిక కులగణనను ప్రచారం చేయడానికి మీడియాను సమర్థవంతంగా ఉపయోగించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, అనసూయ (సీతక్క), జూపల్లి, తుమ్మల, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ , సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హరీష్ పాల్గొన్నారు.